ఫార్మా రైతులకు పరిహారం అందిస్తాం: సబ్ కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న ఉమాశంకర్ ప్రసాద్

దుద్యాల, న్యూస్‌టుడే: ఫార్మా కంపెనీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి పరిహారం అందిస్తామని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మండలంలోని పోలేపల్లిలో 67 సర్వే నెంబర్‌లో 71 ఎకరాలకు సంబంధించి ప్రభుత్వ భూమి నుంచి పట్టాలు పొందిన 35 మంది రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఫార్మా భూనిర్వాసితులకు నష్ట పరిహారం కింద ఎకరాకు రూ.10 లక్షలు, 125 గజాల ఇంటి స్థలం, ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు. దీనికి రైతులు అంగీకారం తెలిపితే అధికారులను సంప్రదించాలని సూచించారు. బాధిత రైతులు మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీకి మాత్రం భూములు ఇవ్వమబోమన్నారు. ఇతర ఎలాంటి ఐటీ కంపెనీ నిర్మించినా అంగీకరించేందుకు ముందుకొస్తామని తెలిపారు. వ్యవసాయ భూములే జీవనాధారమని, ఫార్మాకు ఇస్తే ఎలా బతకాలని అధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఓ సందర్భంలో అధికారులు, రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని సర్ది చెప్పారు. ఫార్మా బాధిత రైతులు తెలిపిన అభిప్రాయాలను నమోదు చేసుకొని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) అధికారి వెంకట్‌రెడ్డి, దుద్యాల, కొడంగల్ తహసీల్దార్లు బి.వెంకటేశ్‌ప్రసాద్, విజయ్‌కుమార్, ఆర్ఐ రవికిషోర్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం.. గాల్లో దీపం!

- రక్తమోడుతున్న హైదరాబాద్-బీజాపూర్ హైవే
- ఏటా 250 మందికి పైగానే దుర్మరణం

న్యూస్‌టుడే- పరిగి, పూడూరు, కొడంగల్

బీజాపూర్- హైదరాబాద్ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. తెలంగాణ- కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, పరిగి, పూడూరు మీదుగా వెళుతోంది. హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని గుల్బర్గా, బీజాపూర్‌తోపాటు వికారాబాద్ జిల్లాకు వెళ్లేందుకు ఈ మార్గమే కీలకం. అనంతగిరి, కోట్‌పల్లి ఈ దారిలోనే ఉండటంతో రాకపోకలు అధికంగా సాగుతుంటాయి. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు ఇరుకు రహదారి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళుతున్నారు. పూడూరు దగ్గర గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. పూడూరు మండలం మన్నెగూడ నుంచి కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ పరిధి బిచ్చాల్ వరకు మూడు వరుసల రోడ్డు ఉన్నా విభాగినులు, సూచికల్లేవు. పలుచోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. జాతీయ రహదారిగా ప్రకటించడంతోపాటు ప్రమాదకారిగానూ గుర్తించారు.

సర్వే పూర్తయినా..


రోడ్డు విస్తరణలో భాగంగా సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. రహదారిపై మలుపుల తగ్గింపు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు టెండర్లు దక్కించుకున్న సంస్థ పలు మార్లు సర్వేలు చేసింది. రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలను తొలగించడంలో అవరోధాలు ఏర్పడడంతో అధికారులు చిన్న మరమ్మతులతో సరిపెట్టాల్సి వస్తోంది.


పరిగి: చింతల్ చెరువు వద్ద మలుపు

కోర్టు కేసుతోనే జాప్యం..

జాతీయ రహదారి వెంట ఉన్న చెట్లకు సంబంధించి కోర్టులో కొందరు కేసు వేశారు. అందువల్లే రహదారి విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోంది. కేసు కొలిక్కి రాగానే మిగిలిన పనులు పూర్తి చేస్తాం.

– నాగేశ్వర్‌రావు, పాజెక్టు డైరెక్టర్, నేషనల్ హైవే.



ఈ హైవేపై రాజేంద్రనగర్ పరిధిలోని అప్పా కూడలి నుంచి మన్నెగూడ వరకు 45 కి.మీ. మేర 4 వరుసల రోడ్డుగా విస్తరించాల్సి ఉంది. ఇందుకు 266.55 హెక్టార్ల భూమి సేకరించాలి. మొత్తం రోడ్డు నిర్మాణానికి రూ.715.98 కోట్లు ఖర్చవుతుందని అంచనా.

- కొడంగల్ డివిజన్ పరిధిలో 163 హైవే: 36 కి.మీ
- జరిగిన ప్రమాదాలు: 39 • మృతులు: 21 • క్షతగాత్రులు: 25

- పరిగి పరిధిలో విస్తరించి ఉన్న జాతీయ రహదారి: 35 కి.మీ
- ఆర్నెల్లలో జరిగిన ప్రమాదాలు: 35 • మృతులు: 13 • క్షతగాత్రులు: 28

దశల వారీగా హామీల అమలు: శాసనసభాపతి


మాట్లాడుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్.. చిత్రంలో మంత్రి తుమ్మల, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి తదితరులు

వికారాబాద్, మర్పల్లి– న్యూస్‌టుడే: ఎన్నికల హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడంతో సంక్షేమ కార్యక్రమాలకు అవరోధంగా మారాయని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మర్పల్లి వ్యవసాయ విపణి పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పలు సాంకేతిక కారణాలతో రుణమాఫీ కొంతమంది రైతులకు వర్తించలేదన్నారు. వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తల తాకట్టు పెట్టయినా వారం, పది రోజుల్లో మిగిలిన రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. ట్రిపుల్ ఆర్‌తో రంగారెడ్డి ప్రాంతం బంగారు తునక అవుతుందన్నారు. వికారాబాద్ ప్రాంత రైతులు సాగు చేసే కూరగాయలు, ఉద్యాన పంటలను విదేశాలకు ఎగుమతి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మర్పల్లి వ్యవసాయ విపణి అధ్యక్షుడిగా వై.మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మల్లేష్ యాదవ్, కార్యవర్గ సభ్యులతో కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. మర్పల్లి జడ్పీ బాలికల పాఠశాలలో సికింద్రాబాద్, జింఖానా లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్మించిన శౌచాలయాలను, ప్రభుత్వ జూనియర్ కళాశాల బీసీ బాలుర వసతిగృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, పరిగి, తాండూర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, యాదయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధ్యక్షుడు రాయల్ నాగేశ్వరరావు, కలెక్టర్ ప్రతీక్‌జైన్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతి, ఎస్పీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

డీజీపీని కోరిన మాజీమంత్రి మాణిక్‌రావు సతీమణి

తాండూరు, న్యూస్‌టుడే: పోలీసు రక్షణ కల్పించాలని మాజీ మంత్రి ఎం.మాణిక్‌రావు సతీమణి, విద్యావికాస సమితి ట్రస్ట్ ఛైర్మన్ శశిప్రభ.. డీజీపీని కోరారు. ఈనెల 17న ఆమె ఫిర్యాదు చేశారు. తాండూరు పట్టణంలో విద్యావికాస సమితి ట్రస్టు యాజమాన్యం అధీనంలోని 33 ఎకరాల భూమిని 2021 నవంబరు 5న పలువురు తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చూడడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకున్నానన్నారు. ఇప్పుడు మళ్లీ వారు చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. వారి నుంచి ప్రాణభయం ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు.

బంగారు ఆభరణాలతో పరారీ?

వికారాబాద్, న్యూస్‌టుడే: బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టుకొని రుణాలిచ్చే పట్టణంలోని ఓ ఫైనాన్స్ సంస్థ అధికారి బంగారు ఆభరణాలతో పరారైనట్లు శుక్రవారం సాయంత్రం తెలిసింది. ఓ వినియోగదారుడు తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకోవడానికి సంస్థ కార్యాలయానికి వెళ్లాడు. ఎంతకీ ఇవ్వకపోవడం, పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానంతో సిబ్బందికి గట్టిగా నిలదీసినట్లు సమాచారం. బంగారు నగలతో సంస్థకు చెందిన ఓ అధికారి ఉడాయించినట్లు ప్రచారం జరిగింది. విషయం బయటికి పొక్కడంతో పలువురు వినియోగదారులు కార్యాలయం వద్దకు వచ్చారు. సంస్థ సిబ్బంది ఎవరినీ లోపలికి అనుమతించకుండా తలుపులు మూసేశారు. ఈ విషయమై వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.

పోచమ్మ తండాలో చిరుత కలకలం

కొడంగల్: పోచమ్మతండాలో చిరుత తిరిగినట్లు తండావాసులు ఆటవీశాఖ అధికారులకు తెలిపారు. అటవీశాఖ సెక్షన్ అధికారి రతన్‌సింగ్ మాట్లాడుతూ.. అప్పాయిపల్లి, పోచమ్మతండాల సరిహద్దు ప్రాంతంలో చిరుత సంచరించినట్లు తండావాసులు వినతి పత్రం ఇచ్చారన్నారు. పాతముద్రలుగా భావిస్తున్న చిత్రాలు తెచ్చారన్నారు. శనివారం తండాను పరిశీలిస్తామని అధికారి తెలిపారు. రైతులు రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లొద్దన్నారు.

హంగు.. ఆర్భాటం.. నిరుపయోగం



తాండూరు పట్టణ శివారు అంతారం గుట్టపై రూ.2 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ ఎకరం స్థలంలో ఆడిటోరియం భవనం నిర్మించింది. 1,000 మంది కూర్చునేందుకు వీలుగా, వేదికతోపాటు రెండు గదులు, స్త్రీ, పురుషులకు గౌరవ గృహాలు కట్టారు. భవనాన్ని ఇటీవల ప్రారంభించారు. తర్వాత దాని నిర్వహణ మరిచారు. ప్రస్తుతం భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి నిరుపయోగంగా మారింది. – న్యూస్‌టుడే, తాండూరు.

గుంతలు పడి.. మడుగులా మారి



ఇటీవల కురిసిన వర్షాలకు తాండూరు మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. చెంగేష్‌పూర్, ఎల్మకన్నె, సంకిరెడ్డిపల్లి, మల్కాపూర్, సంగెం కలాన్ రోడ్డుపై గుంతలు పడి కంకర తేలింది. గుంతల్లో వరద నీరు నిలవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయాలని అధికారులను కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ.

డిజిటల్ సర్వేపై అవగాహన


సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, పుర అధ్యక్షురాలు మంజుల

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: డ్రోన్ సాంకేతికతతో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించడం ద్వారా భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం పురపాలక సమావేశ మందిరంలో నిర్వహించిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో డ్రోన్ సాంకేతికతతో డిజిటల్ సర్వేపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వేకు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. అందరూ సహకరిస్తే భవిష్యత్తు తరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పుర అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద వికారాబాద్ పురపాలికలో మొట్టమొదటిసారిగా డ్రోన్ కెమెరాల సాయంతో డిజిటల్ సర్వే చేస్తున్నారన్నారు. ఈ సర్వేతో మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తారన్నారు. పట్టణంలో ఎక్కడ ఏమేమి ఉన్నాయో క్షుణ్నంగా తెలుస్తుందన్నారు. ఈ సర్వే ద్వారా భవిష్యత్తులో సమస్యలు లేని పురపాలికగా తీర్చిదిద్దవచ్చన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి కమిషనర్ రాకేష్‌రెడ్డి, డీటీసీపీ, పుర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మన్నెగూడ మీదుగానే రీజినల్ రింగు రోడ్డు: ఎమ్మెల్యే


కండ్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, న్యూస్‌టుడే: రీజినల్ రింగు రోడ్డు మన్నెగూడ మీదుగా వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, నిర్మాణం పూర్తయితే జిల్లా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కండ్లపల్లి నుంచి హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి వరకు రూ.64 లక్షలతో చేపట్టిన బీటీ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామానికి, తండాకు దశల వారీగా రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. రీజినల్ రింగు రోడ్డులో భూములు కోల్పోయిన వారిని నిరాశ్రయులను కానివ్వమన్నారు. వ్యాపార కేంద్రంగా ఉన్న ప్రదేశాల్లో భూమి ఇస్తామన్నారు. రింగు రోడ్డు, నాలుగు వరుసల రహదారి, రాడార్ స్టేషన్లతో జిల్లాకు గుర్తింపు వస్తుందన్నారు. గత ప్రభుత్వానివి మాటలు ఎక్కువ, చేతలు తక్కువని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, సతీష్‌రెడ్డి, కడ్మూరు ఆనందం, శ్రీనివాస్, పెంటయ్య, సురేందర్, షకీల్, శ్రీశైలం, అబ్బాస్‌ఖాన్, అబ్రహాం, నరేశ్, సదానందంగౌడ్, హకీం ఉన్నారు.

మార్గదర్శకాలు పాటిస్తేనే మద్దతు

ప్రారంభమవుతున్న కొనుగోలు కేంద్రాలు



- సాధారణ సాగు విస్తీర్ణం: 99,549 ఎకరాలు
- సాగైంది: 1,30,000 ఎకరాలు
- దొడ్డు రకాలు: 73 శాతం
- సన్నాలు: 27 శాతం
- ఎకరాకు సన్నాల దిగుబడి: 2.4 మె.ట.
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు: 107

న్యూస్‌టుడే, తాండూరు: కొనుగోలు కేంద్రాల్లో పత్తి, సన్న రకం ధాన్యం విక్రయాలకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. వీటికి లోబడి విక్రయించే ఉత్పత్తులకే మద్దతు ధరలు చెల్లిస్తారు. ధాన్యం సన్నాలకు మద్దతు ధరతోపాటు క్వింటాకు బోనస్ అందిస్తారు. పత్తికి నిర్ణీత తేమ శాతాన్నిబట్టి మద్దతు ధర ఇస్తారు. పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయి. మరికొన్ని రోజుల్లో రైతులకు అందుబాటులోకి రానున్నాయి.

సాధారణ సాగు: 2,31,338 ఎకరాలు
సాగైంది: 2,51,592 ఎకరాలు
సీసీఐ కేంద్రాలు: 14
ఉత్పత్తి అయ్యే పత్తి: 3,08,038 మె.ట.
కొనుగోలు చేసేది: 2,89,910 మె.ట.
విక్రయించే రైతులు: 79,173
పొడవు పింజ క్వింటా మద్దతు ధర: 7,521
మధ్య రకానికి: 7,121

బోనస్ 33 రకాల ధాన్యాలకే..

సన్నాల్లో 33 రకాల వంగడాలతో పండించిన ధాన్యానికే రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనుంది. ధాన్యం గింజల నిర్ణీత పొడవు, వెడల్పు పరిశీలిస్తారు. పొడవు 6 మి.మీ కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ. కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. తేమ 17 శాతానికి మించరాదు. ప్రమాణాల నిర్ధారణకు ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద మైక్రో మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిర్ణీత తేమ శాతాన్ని ఖరారు చేసింది. 8- 12 శాతం లోపు తేమ ఉన్న పత్తికే మద్దతు ధర చెల్లిస్తారు. 12 శాతం దాటిన పత్తిని కొనరు. 8 శాతం తేమ ఉంటే మద్దతు ధర కింద క్వింటాకు రూ.7,521 చొప్పున చెల్లిస్తారు.

నిర్ణీత ప్రమాణాల మేరకు ఉత్పత్తులు తీసుకురావాలి..

రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చే పత్తి, ధాన్యం నిర్ణీత ప్రమాణాల మేరకు ఉండాలి. అన్నీ సరిగ్గా ఉంటేనే మద్దతు ధర, బోనస్ లభిస్తుంది. ఈ విషయాలను రైతులు గుర్తుంచుకోవాలి. ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలి.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.

బాలస్వాస్థ్య... బాల్యానికి రక్ష

న్యూస్‌టుడే– వికారాబాద్ కలెక్టరేట్, పరిగి

చిన్నతనంలోనే ఆరోగ్య సమస్యలు గుర్తించి వైద్యమందిస్తే ఎంతో మేలు. 0-18 ఏళ్ల వయసున్న పిల్లల్లోని లోపాలు గుర్తించి నివారించడానికి వైద్యులు చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య(ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జిల్లాలో 2017లో ప్రారంభించారు. సంచార వాహనాల ద్వారా వైద్య బృందాలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి మందులు అందిస్తున్నారు.

జిల్లాలో 10 బృందాలు..: పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు జిల్లాలో 10 బృందాలు ఏర్పాటు చేశారు. ప్రతి బృందానికి సంచార వాహనం కేటాయించారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, మర్పల్లికి రెండు బృందాల చొప్పున నియమించారు. బృందంలో వైద్యుడు, ఏఎన్ఎం, ఫార్మాసిస్టు ఉంటారు. కేటాయించిన బడి, అంగన్‌వాడీ కేంద్రం, ఎయిడెడ్, గురుకులాల పిల్లలకు పరీక్షలు చేస్తారు. నవజాత శిశువుల మరణాల రేటు తగ్గించేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపట్టింది. చిన్నారుల్లో 4- 70 శాతం పోషకలోపమున్నట్లు గుర్తించారు.

జిల్లాలో 1,92,324 మంది పిల్లలు..: జిల్లాలో 0-18 ఏళ్ల పిల్లలు 1,92,324 మంది ఉన్నారు. వీరిలో బాలురు 98,618, బాలికలు 93,706 మంది. జనవరి నుంచి ఇప్పటి వరకు 80 శాతం పిల్లలకు పరీక్షలు చేశారు. వారిలో వినికిడి, దృష్టిలోపం, శాశ్వత వైకల్యం, దంతక్షయం, గుండె జబ్బులున్న వారిని గుర్తించారు. తాండూరులోని డీఈఐసీ (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్).. లేదంటే ఎన్ఆర్‌సీ (న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్)కు పంపిస్తారు. అక్కడ వీరికి చికిత్స అందిస్తారు. ఈసారి 39 మంది విద్యార్థులను గుర్తించి హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రిల్లో శస్త్ర చికిత్సలు చేయించారు.


విద్యార్థుల నేత్రాలు పరీక్షిస్తున్న వైద్యుడు

నేత్ర పరీక్షలకు ప్రత్యేక కార్యక్రమం..

నవంబర్ చివరి వరకు విద్యాలయాల్లో నేత్ర పరీక్షలు చేయనున్నారు. లోపాలు గుర్తించి అవసరమైన అద్దాలు, మందులు ఉచితంగా ఇస్తున్నారు. రోజూ ఒక బృందం 250 మంది విద్యార్థులకు పరీక్షలు చేస్తోంది. 10 శాతం వరకు నేత్ర సమస్యలతో బాధపడుతున్నారని వైద్యులు గుర్తించారు.

బడులకు సమాచారం ఇస్తాం..



జిల్లాలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ముందే సమాచారం ఇచ్చి బృందాలు వెళుతున్నాయి. జిల్లాలో 10 సంచార వాహనాలు నడుస్తున్నాయి. మందుల కొరత లేదు. అవసరమైన వారికి ఆశ కార్యకర్తలు వెళ్లి మందులు అందిస్తారు. – డా.పల్వాన్ కుమార్, జిల్లా వైద్యాధికారి.

22న గుండె వైద్య శిబిరం..

ఈనెల 22న తాండూరు ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిలో హైదరాబాద్ కేర్ ఆసుపత్రి, డీఈఐసీ ఆధ్వర్యంలో పీడియాట్రిక్, కార్డియాలజీ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నారు. 0-18 ఏళ్లలోపు పిల్లలు శిబిరంలో పాల్గొని సలహాలు, సూచనలు పొందొచ్చని ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి బుచ్చిబాబు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తండ్రి చెంతకు


తండ్రి, సంస్థ ప్రతినిధులతో బాలుడు

దోమ, న్యూస్‌టుడే: అయిదేళ్ల కిందట తప్పిపోయిన బాలుడు ఎట్టకేలకు ఓ సంస్థ సహకారంతో తండ్రి చెంతకు చేరాడు. మండల కేంద్రం దోమకు చెందిన బాబు దంపతులకు భరత్‌కుమార్ జన్మించాక సంసారం విషయంలో మనస్పర్థలు వచ్చాయి. బాలుడు మూడేళ్ల వయసులో ఉండగా.. ఇద్దరూ విడిపోయారు. కుమారుడితో కలిసి తల్లి బతుకుదెరువుకు హైదరాబాద్‌కు వెళ్లింది. అయిదేళ్ల కిందట హైదరాబాద్‌లో తప్పిపోయిన భరత్‌కుమార్ ఏపీలోని విజయవాడ రైల్వేస్టేషన్‌లో తచ్చాడుతుండగా అక్కడి ఎస్‌కేసీవీ స్వచ్ఛంద సంస్థ బాలుణ్ని చేరదీసింది. కౌన్సెలింగ్ ఇవ్వగా.. సొంతూరు దోమ అని చెప్పడంతో శుక్రవారం సంస్థ ప్రతినిధులు బాలుణ్ని తీసుకొచ్చారు. పోలీసుల ఆధ్వర్యంలో మాజీ సర్పంచి రాజిరెడ్డి ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో తండ్రికి అప్పగించారు. తల్లి నగరంలో ఎక్కడుందో తెలియదని కుటుంబ సభ్యులు తెలిపారు. భరత్‌కుమార్‌ను సంక్షేమ గురుకులంలో చేర్పించాలని గ్రామస్థులు కోరారు. ప్రభుత్వంతో చర్చించి సాయం చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

డ్రోన్ల వినియోగం ఎంతో ప్రయోజనకరం

తాండూరు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించడం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు అన్నారు. శుక్రవారం వ్యవసాయ పరిశోధన స్థానంలో రైతులకు కంది పంట సాగు, డ్రోన్ల వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రోన్లతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలపై చీడపీడల నివారణకు పిచికారీ చేయవచ్చన్నారు. సదస్సులో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.సుధారాణి, శాస్త్రవేత్తలు డా.పరిమళ, లక్ష్మణ్, యమున, శేఖర్, తాండూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు రుద్రమూర్తి, కోరమాండల్ సంస్థ ప్రతినిధులు డా.సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోటీ.. సృజనాత్మకతతో మేటి

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ



పోలీసు అమరుల సంస్మరణ ఉత్సవాల నేపథ్యంలో ఆ శాఖ పలు పోటీలకు తెర తీసింది. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వేదికగా ఎంతో మంది చిన్న వీడియోలు, చిత్రాలు తీస్తూ తమ సృజనాత్మకతను చాటుకుంటుంటారు. ఇలాంటి వారి ప్రతిభను వెలికితీయడమే ధ్యేయంగా పోలీసు శాఖ ఈ పోటీలను నిర్వహిస్తోంది.

తాజాగా తీసినవి..

పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఆ శాఖ కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఫొటో, వీడియోగ్రాఫర్లు, విద్యార్థులతో పాటు పోలీసులకు పోటీలు చేపడుతోంది. పోలీసుల త్యాగాలను, విధుల్లో ప్రతిభను చాటేలా తాజాగా తీసిన 3 చిత్రాలు, 3 నిమిషాల నిడివి ఉన్న లఘుచిత్రాలను పెన్‌డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి పోలీసు శాఖ జిల్లా కార్యాలయంలోని పీఆర్వోకు అందించాలి. వాటి నుంచి బాగున్నవి ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు.

ఏయే అంశాల్లో..

మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో రక్షకుల సేవ, ఇతర సందర్భాల్లో వారి కీర్తి ప్రతిష్ఠలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు ఇలా లఘుచిత్రాలకు అంశాలుగా నిర్దేశించారు. గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు తీసిన లఘుచిత్రాలను మాత్రమే పోటీలకు ఈ నెల 20 లోపు పంపించాల్సి ఉంటుంది.

అంతర్జాలంలో వ్యాసరచన

ఇంటర్ వరకు విద్యార్థులకు విచక్షణతో కూడిన చరవాణి వినియోగం, డిగ్రీ ఆపై వారికి మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అంశాలపై అంతర్జాలం వేదికగా వ్యాసరచన పోటీలు ఉంటాయి. అక్టోబరు 25 లోపు పంపించాలి.

పోలీసు సిబ్బందికి..

కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు సమాజంలో పోలీసు ప్రతిష్ఠ మెరుగుపరచడంలో నా పాత్ర, ఎస్సై నుంచి పై స్థాయి అధికారులకు దృఢమైన శరీరంలో దృఢమైన మనసు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో రాయవచ్చు.

త్యాగాలను స్మరిస్తూ..: అనూరాధ, సిద్దిపేట సీపీ



అమరులైన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ ప్రతి ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాం. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తాం.

ఫుట్‌బాల్‌లో రాణించేలా.. జాతీయస్థాయిలో ఆడేలా..

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడేలా తీర్చిదిద్దడమే ఇండియా ఖేలో ఫుట్‌బాల్ (ఐకేఎఫ్) లక్ష్యం. సౌత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీతో కలిసి ఆటగాళ్ల ఎంపికకు పోటీలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో తొలిసారిగా ఈ నెల 19న మెదక్ ఇందిరాగాంధీ స్టేడియంలో మెదక్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపడుతోంది. హైదరాబాద్, ముంబయి, బెంగళూర్, కోల్‌కతా, చెన్నై, దిల్లీ వంటి ప్రధాన పట్టణాల్లోనే ఈ తరహా ఎంపికలు జరిగాయి. రాష్ట్రంలో మెదక్‌లో (శనివారం), వరంగల్‌లో (నవంబర్ 3న) జరుగనున్నాయి.

శిక్షణ ఇచ్చి..

ప్రోత్సాహం లేక రాణించలేకపోతున్న పట్టణాలు, గ్రామాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో ఈ ప్రక్రియ చేపట్టారు. దేశంలోని ప్రముఖ అకాడమీల్లో తర్ఫీదు పొందవచ్చు. విదేశీ అకాడమీలలోనూ చేరవచ్చు.

ఎంపిక తీరు..

మూడు దశల్లో ఎంపికలు కొనసాగుతాయి. తొలి దశలో మెదక్, వరంగల్ జిల్లాల్లో పోటీలు జరుగుతాయి. ప్రతిభ చూపిన వారిని రెండో దశ రీజనల్ స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ పోటీలను బెంగళూర్‌లో నిర్వహించనున్నారు. మెరుగైన ఆట చూపిన వారిని మూడో దశ (జాతీయ స్థాయి)లో ఆడే అవకాశం దక్కుతుంది. ఇవి న్యూదిల్లీలో జరుగుతాయి.

పారితోషికం..

శిక్షణ సమయంలో విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. పారితోషికం సైతం చెల్లిస్తారు. పలు క్లబ్‌లకు ఆడిస్తూనే, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఆడేలా తీర్చిదిద్దుతారు. ఉమ్మడి మెదక్, సమీపంలోని జిల్లాలకు చెందిన అండర్-13, 15, 17 బాలబాలికలు ఇందులో పాల్గొననున్నారు.

తొలిసారిగా..



జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లను తీర్చిదిద్దే లక్ష్యంతో మూడేళ్లుగా ఐకేఎఫ్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు చేపడుతున్నాం. తొలిసారిగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వారికి సైతం ఈ తర్ఫీదు అందించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నాం. **విష్ణుతేజ, సౌత్‌క్లాన్ ఫుట్‌బాల్ అకాడమీ సహ వ్యవస్థాపకుడు, హైదరాబాద్**



మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియం

సదవకాశం: ఫుట్‌బాల్‌లో రాణించాలనుకునే వారికి సదవకాశం. ప్రముఖ అకాడమీలలో ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా శిక్షణ పొందే అవకాశం దక్కుతుంది. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడవచ్చు. **ప్రకాశ్, మెదక్ ఫుట్‌బాల్ అకాడమీ శిక్షకుడు**


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



శంకర్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఎలుకపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్ఐ సాదాత్‌మియా తెలిపిన వివరాలు.. ఎలుకపల్లికి చెందిన కానికే శంకర్(22) తల్లి గతంలో మృతి చెందడంతో తండ్రి వెంకటేశ్.. దుర్గమ్మను పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో ఏడాది క్రితం వెంకటేశ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ తన పినతల్లి దుర్గమ్మ వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి కుటుంబ సమస్యలపై దుర్గమ్మతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శంకర్ రాత్రి 11 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అన్ని చోట్ల వెతికినా జాడ దొరకలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉండడం గ్రామస్థులు గమనించారు. శంకర్ సోదరి శైలజ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.


కుటుంబ కలహాలతో మరొకరు..



రాజు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన వల్లపు రాజు(35) కొన్నాళ్లుగా గుమ్మడిదలలో అద్దె ఇంట్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్ల కిందట ఆయనకు గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన లక్ష్మీతో రెండో వివాహమైంది. ఇటీవల కుటుంబ కలహాలు చెలరేగాయి. భార్యతో గొడవ జరగడంతో ఆయన మామ రాజు ద్విచక్ర వాహనం తీసుకెళ్లాడు. దీనికి మనస్థాపానికి గురైన రాజు శుక్రవారం మధ్యాహ్నం ఆయన సోదరుడు మహేశ్‌కు ఫోన్‌చేసి బాధగా మాట్లాడారు. తదుపరి పక్కింటి వారు ఫోన్‌చేసి రాజు ఇంట్లో ఉరి వేసుకున్నాడని చెప్పడంతో ఆయన సోదరుడు, తల్లి మల్లమ్మ వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

అనుమానాస్పద స్థితిలో యువవకుడి మృతి



శివసాయి

మెదక్ రూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటన పట్టణంలోని అవుసులపల్లిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన నాగారం రాజయ్య, లక్ష్మి కుమారుడు శివసాయి(23) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటున్నాడు. రాజయ్య సుమారు 20ఏళ్ల క్రితం మృతి చెందడంతో తల్లి పోషిస్తోంది. గురువారం రాత్రి తల్లి లక్ష్మి, ఆమె అక్క భర్త రవి, కుమారుడు శివసాయి మద్యం తాగారు. తర్వాత రవి వారి ఊరికి వెళ్లిపోయాడు. కొంతసేపటికి కుమారుడు లేడని చుట్టుపక్కల వారికి చెప్పి వెతికింది. రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూస్తే అతను గడ్డి పక్కన గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే స్థానికులు మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. తల్లే చంపిందని బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. తల్లి, ఆమె అక్కపై గ్రామస్థులు దాడికి ప్రయత్నించడంతో పోలీసులు ఇద్దరినీ ఠాణాకు తరలించారు. కేసు నమోదైంది.

ప్రమాదవశాత్తు నీటమునిగి ఒకరి మృత్యువాత



గణేష్

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన ప్రకారం.. రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బేగరి గణేష్(45) రెండు రోజుల క్రితం బహిర్భూమికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. చెరువు వద్ద చూసినా ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం చెరువులో నీటిపై తేలింది. గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నరసమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

వరికోత వాహనం ఢీకొని చిరువ్యాపారి..

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: వరికోత వాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా గుండారం గ్రామానికి చెందిన షేక్ ఆరీఫ్ గత ఏడాది ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నాడు. మంబోజిపల్లి మార్కెట్ వద్ద బజ్జీల బండి పెట్టుకుని కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. శుక్రవారం అక్కడే బండి పెట్టుకోగా వెనుక నుంచి వచ్చిన వరికోత వాహనం ఢీకొనడంతో కిందపడిపోయాడు. అతన్ని భార్య మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. డ్రైవర్ కాశ్మీర్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుల్తానా బేగం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గేదెను తప్పించబోయి రైతు దుర్మరణం

చిలప్‌చెడ్: గేదెను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి రైతు దారబోయిన వీరేశం(49)మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మిస్బోద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం.. వీరేశం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా చిట్కుల్ గ్రామ శివారులో దారిపైకి ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో దానిని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. దీంతో వీరేశం తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 120-00	డ్రెస్డ్ 206-00	
రిటైల్ 142-00	స్కిన్‌లెస్ 234-00	

మా ఊరికి మహాలక్ష్మి వచ్చింది!

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం గుడుపల్లి, ఔరంగ్‌నగర్, గౌసాబాద్ తదితర గ్రామాల మీదుగా నడిచే ఆర్టీసీ బస్సు ఐదేళ్ల కిందట నిలిచిపోయింది. సరైన ఆదాయం రాకపోవడంతో సంబంధిత అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలు కర్ణాటక రాష్ట్రానికి చెందిన బస్సు ఎక్కేవారు. లేదంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చేది. ఈ క్రమంలో గురువారం జహీరాబాద్‌లో పర్యటించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి డా. ఏ.చంద్రశేఖర్ మొగుడంపల్లి మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. జహీరాబాద్ డిపో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శుక్రవారం బస్సు సర్వీసును షురూ చేశారు. పద మూడు గ్రామాల ప్రజలకు ఊరట దక్కింది. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు రాకపోకలు సాగించనుంది. ఇక మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకునే అవకాశం చిక్కింది.



- న్యూస్‌టుడే, మొగుడంపల్లి (జహీరాబాద్ అర్బన్)

పాములన్నీ ప్రమాదకరం కాదు



సర్పాన్ని ప్రదర్శిస్తూ వివరిస్తున్న ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సభ్యులు

ములుగు, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన 'ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ' ఆధ్వర్యంలో శుక్రవారం పాములపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విష సర్పాలు, విషంలేని సర్పాలను గుర్తించడం, పాము కాటుకు ప్రథమ చికిత్స చేయడాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో అటవీ కళాశాల పరిశోధన కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎస్.ఎస్.శ్రీనిధి మాట్లాడుతూ సమాజంలో సర్పాలంటే అందరికీ ఎంతో భయం ఉంటుంది. పాములన్నీ ప్రమాదకరమైనవి కాదని, కొన్ని మాత్రమే విషపూరితమైనవన్నారు. అనేక రకాల సర్పాలు పంటలను నాశనం చేసే ఎలుకలు, ఇతర కీటకాలను తిని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు మేలు చేస్తున్నాయన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాటేసిన కాలువ

ఆరు నెలల్లోనే నీటిలో పోయిన తండ్రి, కుమారుడి ప్రాణాలు



యాదగిరి

గజ్వేల్ గ్రామీణ: ఆరు నెలల క్రితం కుమారుడు కాలువలో ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోగా.. ఇప్పుడు తండ్రి అందులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. వరుస విషాదాలతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. సీఐ సైదా తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దాతర్‌పల్లి- రిమ్మనగూడ మధ్యలోని కొండపోచమ్మ జలాశయం కాలువలో వ్యవసాయ కూలీ గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. దాతర్ పల్లి కి చెందిన నాయిని యాదగిరి (40)కి భార్య వాణి, కుమార్తె ఉన్నారు. యాదగిరి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం కాలువలో మృతదేహం తేలింది. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

21న డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన



హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: డీసెట్ ర్యాంకు సాధించి పలు కారణాలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాని అభ్యర్థులకు ఈ నెల 21న హవేలిఘనపూర్‌లోని జిల్లా విద్యా శిక్షణా సంస్థలో తిరిగి పరిశీలన ప్రక్రియ చేపడుతున్నట్లు డైట్ ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. అభ్యర్థులు ర్యాంకుకార్డు, డైట్ సెట్ హాల్‌టికెట్, పది, ఇంటర్ మార్కుల మెమోలు, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు బోనఫైడ్లు, ఇంటిగ్రేటెడ్ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ప్రత్యేక విభాగాల ధ్రువపత్రాలు (ఎన్‌సీసీ, స్పోర్ట్స్, దివ్యాంగులు, సైన్యంలో విధులు) తీసుకురావాలని సూచించారు. ఈ నెల 23 నుంచి 26 వరకు మీ సేవా కేంద్రాల్లో వెబ్‌ఆప్షన్లు ఇవ్వాలని, వీలైనన్ని ఎక్కువ కళాశాలలు ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. 30న సీట్లు కేటాయిస్తామని, నవంబరు 3లోపు ప్రవేశం పొంది, ఫీజు చెల్లించాల్సి ఉంటుంది, 4న కేటాయించిన కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో చేరాల్సి ఉంటుందని వివరించారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



మమత

పుల్కల్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందిన ఘటన చౌటకూరు మండల హొన్నాపూర్ వద్ద శుక్రవారం జరిగింది. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ తెలిపిన ప్రకారం మండలంలోని గంగోజిపేటకు చెందిన కాశపాగ మమత (30)కు ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. కొన్ని రోజులుగా భర్తకు దూరమై పుట్టింట్లో ఉంటోంది. సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్‌ఆర్ ఆసుపత్రి భోజనశాలలో హెల్పర్‌గా పని చేస్తోంది. మూడు రోజుల కిందట ఇంటి నుంచి విధులకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. శుక్రవారం హొన్నాపూర్ జాతీయ రహదారి పక్కన శవమై కనిపించింది. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరి పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కళా ఉత్సవ్ పోటీల్లో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుబ్బాక, న్యూస్‌టుడే: పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు మూడు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.బుచ్చిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆరు విభాగాల్లో జరిగిన పోటీల్లో 10వ తరగతి విద్యార్థులు ఎ.చామంతి ఏకపాత్రాభినయంలో, సీహెచ్ యశ్వంత్ వాద్య సంగీతంలో, క్రాంతి కుమార్ చిత్రలేఖనంలో ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గైడ్ టీచర్లను ఎంఈవో ప్రభుదాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

చాటుగా ప్రేమ వివాహం.. వరుడి ఇంటిపై దాడి

రాయపోల్, న్యూస్‌టుడే: ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిని పాక్షికంగా ధ్వంసం చేసిన ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం టెంకంపేటలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఏఎస్ఐ రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన యువకుడు (19), యువతి (20) హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. అక్కడ వారికి పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరు కావడం, యువకుడికి చట్టప్రకారం పెళ్లీడు వయసు రాకపోవడంతో వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. ఈనెల 17న హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు వెళ్లి వివాహం చేసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రాయపోల్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరూ వచ్చారు. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు.. వరుడి ఇంటికి వెళ్లి పెంకులు, రేకులు ధ్వంసం చేశారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురిలో దూషించాడని.. మద్యం తాగించి మిత్రుడి హత్య



వివరాలు వెల్లడిస్తున్న చేర్యాల సీఐ శ్రీను, పక్కన మద్దూరు ఎస్సై మహబూబ్

చేర్యాల(మద్దూరు), న్యూస్‌టుడే: మహిళలు సహా పలువురి ఎదుట అవమానకరంగా దూషించడంతో కోపం పెంచుకున్న మిత్రుడు కక్ష పెంచుకొని మద్యం తాగించి హత్య చేశాడు. సిద్దిపేట జిల్లా ధూల్మిట్ట మండలం కూటిగల్ శివారులో ఈనెల 15న అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి (48) కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం మద్దూరు ఠాణాలో జరిగిన సమావేశంలో చేర్యాల సీఐ ఎల్.శ్రీను వివరాలు వెల్లడించారు. ఈనెల 14న బెక్కల్‌కి చెందిన బైరగోని లక్ష్మి మద్దూరు స్టేషన్‌లో తన భర్త యాదగిరి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ మరుసటి రోజే కూటిగల్ శివారులో యాదగిరి మృతదేహం లభ్యమైంది. హత్యకు గురైనట్లు నిర్ధారించుకొని మద్దూరు, చేర్యాల, కొమురవెల్లి ఎస్సైలు మహబూబ్, నీరేశ్, రాజు ఆధ్వర్యంలో మూడు బృందాలు దర్యాప్తు చేశాయి. బైరాన్‌పల్లికి చెందిన నందనబోయిన బాలకృష్ణను అనుమానితుడిగా భావించి, అతని కోసం గాలిస్తుండగా శుక్రవారం మద్దూరు మండలం ఉప్పరోనిగడ్డ శివారులో పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈనెల 13న బెక్కల్‌లో అవమానిస్తూ యాదగిరి తిట్టడంతో బాలకృష్ణ కోపం పెంచుకున్నాడు. అంతుచూడాలని భావించిన బాలకృష్ణ.. అదే రోజు సాయంత్రం యాదగిరిని బైక్‌పై తీసుకెళ్లి మద్యం తాగించాడు. మత్తులో ఉండగా కర్రతో తలపై బాది హత్య చేశాడు. బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. కేసు ఛేదించిన ఎస్సైలను, సిబ్బందిని సీఐ అభినందించారు. సీసీ కెమెరాలు ఉండటంతో కేసు ఛేదనకు తోడ్పడ్డాయని తెలిపారు.

బంగారు బాల్యానికి.. పంచసూత్రం!

● అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యాచరణ

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట, మెదక్, తాండూరు

నేటి బాలలు.. రేపటి భావిభారత పౌరులు. బంగారు భవితకు బాటలు పడేది ప్రాథమిక దశలోనే. ఈ తరుణంలో వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆయా సేవలకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. వివిధ రూపాల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నా పోషణ లోపంతో పలువురు బాధపడుతున్నారు. వారిని సంపూర్ణ ఆరోగ్యులుగా తీర్చిదిద్దే క్రతువులో భాగంగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో చిన్నారుల అభ్యున్నతికి పంచసూత్రాల అమలుకు శ్రీకారం చుట్టడం విశేషం.

మార్పు తీసుకొచ్చే లక్ష్యంతో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో 9, వికారాబాద్ జిల్లాలో 5 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 4,837 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. చిన్నారులకు అధిక పోషకాలున్న బాలామృతం అందిస్తున్నారు. ఎవరికైనా పోషణ లోపం ఉంటే వారిని వైద్యుల వద్దకు తీసుకెళ్తున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తూ మార్పు తెస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాల వారిని గుర్తించి పూర్వప్రాథమిక స్థాయి విద్యను అందిస్తూ.. కావాల్సిన ఆహారం సమకూర్చుతున్నారు.

	ప్రాజెక్టులు	అంగన్‌వాడీ కేంద్రాలు
సంగారెడ్డి	5	1,504
మెదక్	4	1,076
సిద్దిపేట	5	1,150
వికారాబాద్	5	1,107



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పక్కాగా అమలుచేస్తున్నాం: లలిత కుమారి, జిల్లా సంక్షేమాధికారిణి, సంగారెడ్డి

చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పంచసూత్రాలు పక్కాగా అమలయ్యేలా చూస్తున్నాం. పోషణలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం.

పంచసూత్రాలు ఇలా..

1000 రోజుల ప్రణాళిక

జిల్లాల్లో పోషణ లోపం కలిగిన చిన్నారులపై ప్రత్యేక కార్యక్రమం. 1000 రోజుల పాటు ఇది కొనసాగుతుంది. చిన్నారుల్లో మార్పునకు అవసరమైన చర్యలు తీసుకుంటారు.

పౌష్టికాహారం తినడం

చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలకు పోషణలోపమే ప్రధాన కారణం. బాల్యదశలో సమతుల ఆహారం అందించకపోతే ఎదురయ్యే ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించడంతో పాటు ఇంటి వద్ద కూడా ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలియజేస్తున్నారు.

రక్తహీనత నివారణ

పలువురు చిన్నారుల్లో రక్తహీనత సమస్య తలెత్తుతోంది. ఇలాంటి వారిని గుర్తించి.. పౌష్టికాహారం అందిస్తారు.

డయేరియాకు దూరంగా..

కలుషిత నీరు, ఆహారం తదితర కారణాలతో చిన్నారులు డయేరియా బారినపడుతున్నారు. ఫలితంగా శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. నిర్లక్ష్యం వహిస్తే పరిస్థితి చేయిదాటే ప్రమాదం లేకపోలేదు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, ఒకవేళ అతిసారం బారినపడితే ముందడుగు వేయాల్సిన తీరుపై సూచనలు చేస్తున్నారు.

శుచి, శుభ్రత

శుచి, శుభ్రత పాటించకపోతే రోగాలు ప్రబలే ఆస్కారం ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య అధికం. చేతుల శుభ్రతతో ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులు తరచూ చేతులను శుభ్రం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

బాలిక హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

సదాశివపేట: బాలిక హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జి.భవానీచంద్ర శుక్రవారం తీర్పు ఇచ్చారు. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ఇబ్రహింపల్లి గ్రామానికి చెందిన వీరేశం భార్య కల్పన మూడేళ్ల కూతురు భవ్యతో కలిసి గతంలో ప్రసవానికి షాబాద్ మండలం బోడపహాడ్ గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. అక్కడ రాజు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి అక్కడే ఉండిపోయింది. కాన్పు అనంతరం చిన్నకూతురు, పెద్ద కూతురు భవ్య, ప్రియుడితో కలిసి సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీకి మకాం మార్చారు. తమతో ఉంటున్న భవ్య తనను నాన్న అని పిలవడంలేదని రాజు ఆగ్రహంతో చిన్నారిని గోడకు కొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన 26 ఫిబ్రవరి 2019లో జరిగింది. ఈ విషయం తండ్రి వీరేశానికి తెలియడంతో కూతురు మరణంపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ కల్పన, రాజుపై కేసు నమోదు చేసి విచారించగా, నిందితులు నేరం అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి యావజ్జీవ ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు.

గాలికుంటు టీకాలు తప్పనిసరి

ధారూర్, న్యూస్‌టుడే: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి స్వేత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ధరూర్, దోర్నాల్, మైలారంలలో 1,050 పశువులకు టీకాలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు బాబురావు, మహేష్, భీమయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి తాండూరులో సీపీఎం జిల్లా మహాసభలు

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా సీపీఎం మూడో మహాసభలు ఈనెల నేడు, రేపు (శని, ఆదివారం) తాండూరు పట్టణంలో నిర్వహిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, అక్బర్, నవీన్, యాదయ్య, జంగయ్య పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పెద్దేముల్, న్యూస్‌టుడే: అనారోగ్యంతో మరణించిన ఓ పేద కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం కోట్‌పల్లి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

తాగునీటి సహాయకులకు శిక్షణ

పెద్దేముల్, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీలో పనిచేస్తున్న తాగునీటి సహాయకులకు ఈనెల 19 నుంచి 23వ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని మండల మిషన్ భగీరథ ఏఈ అఖిల్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు.

కొత్త టీచర్లకు అవగాహన

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024 ద్వారా నియమితులైన కొత్త టీచర్లకు వివిధ అంశాలపై శుక్రవారం ఎంఈవో హరిలాల్ ఎంఆర్సీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, చేపడుతున్న అభివృద్ధి పనులు తదితర అంశాలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో చౌదర్‌పల్లి జీహెచ్‌ఎం రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కాలువలు కనుమరుగు

- బాగు చేస్తేనే అన్నదాతలకు ప్రయోజనం

న్యూస్‌టుడే, పరిగి, బొంరాస్‌పేట:

పరిగి డివిజన్‌లో 443 సాగునీటి వనరుల కింద సుమారు 28వేల ఆయకట్టు ఉంది. పర్యవేక్షణ కొరవడి చిన్నచిన్న కుంటలు నేడు కానరాకుండా పోయాయి. నీరందించే ప్రధాన కాలువలు పొదలు, చెట్లు మొలిచి పూర్తి అధ్వానంగా తయారయ్యాయి.

నాలుగో విడత అంతంతే

డివిజన్ వ్యాప్తంగా మిషన్ కాకతీయ కింద మొదటి విడతలో రూ.24.93కోట్లు, రెండో విడతలో రూ.25.62 కోట్లు, మూడో విడతలో 31 పనులకు రూ.5.19కోట్లు మంజూరయ్యాయి. కానీ పూర్తిస్థాయిలో మంజూరైన వాటిని చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా పూడికతీత, కట్టలు పటిష్ఠ పరచడం, కాల్వలు బాగు చేయడం వంటి పనులు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో ఇవి మంచి ఫలితాలను ఇచ్చినా.. మరికొన్ని మిగిలిపోయాయి. దీంతో అవి రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నాలుగో విడతలో మిగతా వాటిన్నంటినీ చేపడుతుందని భావించిన తరుణంలో ఊసేలేకుండా పోయింది.



బాసుపల్లి కొత్త చెరువు ప్రధాన కాల్వ కనిపించని..

ఇవిగో ఉదాహరణలు

- పరిగి మండలం మిట్టకోడూరు చెరువు ఆయకట్టు సుమారు 170 ఎకరాలు. చెరువు నిండా నీరున్నా తూములు సక్రమంగా పనిచేయడం లేదు. అవి తరచూ మొరాయించడంతో అవస్థలు పడుతున్నారు.
- సొండేపూర్ పెరుమాళ్ల చెరువు కట్ట భారీ వర్షాలకు రెండేళ్ల క్రితం తెగిపోయినా.. మరమ్మతు పనులు లేవు. దీంతో వర్షపు నీరంతా వృథాయే.
- దోమ మండలం బాసుపల్లి కొత్త చెరువు ఆయకట్టు 175 ఎకరాలు. కాల్వలు బాగాలేక ఆయకట్టుకు నీరందడం లేదు. అలుగు శిథిలావస్థకు చేరడంతో పాటు ప్రధాన కాల్వ పొదలు పెరిగి ఆనవాళ్లు కోల్పోయింది.



పరిగి మండలం పెరుమాళ్ల చెరువు కట్ట తెగిన తీరు..

కొడంగల్ పరిధిలో..: నియోజకవర్గంలో 214 చెరువులు, 13,777 ఎకరాల ఆయకట్టు ఉంది. బొంరాస్‌పేట మండలంలోని బొంరాస్‌పేట, ఏర్పుమళ్ల కాకరవాణి ప్రాజెక్టు, మెట్లకుంట ఎల్లమ్మ చెరువు, బురాన్‌పూర్ పెద్ద చెరువు ఎక్కువ ఆయకట్టు సాగయ్యే చెరువుల నుంచి పంటలకు నీరందించే ప్రధాన కాలువలు పటిష్ఠంగా లేవు. ఏటా రైతులే స్వతహాగా బాగు చేసుకోవాల్సి వస్తోంది. మరమ్మతులు ఆలస్యం ప్రభావంతో పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు, వడగళ్లతో పంటనష్టం జరుగుతోందని వాపోతున్నారు.

తీర్మానాలు చేస్తే మరమ్మతులు - కిరణ్‌కుమార్, డీఈ నీటిపారుదల శాఖ కొడంగల్

పంట కాలువలను ఉపాధిహామీ పథకంలో మరమ్మతు చేసే అవకాశం ఉంది. కాలువలు మరమ్మతు చేయాలని రైతులు తీర్మానం చేసి ఇస్తే అంచనాలు రూపొందించి మంజూరు అయిన తరువాత బాగు చేయిస్తాం. రైతులపై ఆర్థిక భాగం పడకుండా చూస్తాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కొడంగల్ డివిజన్‌లోని అన్ని చెరువులు నిండాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ? కుదురుమళ్ల ఇండాపూర్ మధ్య వాగుపై వంతెన లేక తీవ్ర అవస్థలు పడుతున్నాం. అధికారులు వంతెన నిర్మాణం చేపట్టాలి. **- గోవిందు కుదురుమళ్ల**

✓ ఆగ్రామాల మీదుగా నందారం వరకు తారు రోడ్డు మంజూరైంది. రోడ్డుతో పాటు వంతెన నిర్మిస్తారు. **- రవికిరన్, పీఆర్ఏఈ దౌల్తాబాద్**

న్యూస్‌టుడే, కుల్కచర్ల గ్రామీణ: ? బోట్యానాయక్ తండాలో రోడ్డుకు పక్కనే బావి ప్రమాదకరంగా ఉంది. అటువైపు చిన్నారులు, మూగజీవాలు వెళితే ప్రమాదం జరగడానికి అవకాశం ఉంది. బావి చుట్టూ రక్షణగా కంచెను ఏర్పాటు చేయించేలా చూడాలి. **-శంకర్, స్థానికుడు**

✓ తండాలో రోడ్డుకు పక్కనే బావి ప్రమాదకరంగా ఉందనేది వాస్తవమే. సమస్యను మండల అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తాం.
- విజయ్, పంచాయతీ కార్యదర్శి

న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ: ? పరిగి మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి స్టేజీ పరిసరాల్లో పరిగి-షాద్‌నగర్ రహదారి పక్కన 33 కేవీ విద్యుత్తు స్తంభానికి, తీగలకు గుబ్బురుగా పచ్చని తీగలు అల్లుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. **- గడ్డమీది చిన్న వెంకటయ్య, నాగేష్, రాములు పరిసర రైతులు రాఘవాపూర్ పరిగి మండలం.**

✓ కంపెనీలకు సరఫరా జరిగేలైన్ కావడంతో విద్యుత్తు సరఫరాను ఆపేందుకు అనుమతి తీసుకుని లైన్ క్లియరింగ్‌లో భాగంగా తీగలను తొలగిస్తాం. **- రాజు, రాపోల్- పరిగి ఫీడర్ లైన్‌మెన్, పరిగి మండలం.**

న్యూస్‌టుడే, పూడూరు: ? గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో చేతి పంపు కొన్ని రోజులుగా పనిచేయటం లేదు. దీంతో నల్లాల ద్వారా నీటిసరఫరా ఆగితే ఇబ్బందులు పడుతున్నాం. **- లక్ష్మమ్మ, పెద్దఉమ్మెంతాల్**

✓ స్థానికంగా ఏఈ లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. పరిశీలించి వెంటనే అందుబాటులోకి తెస్తాం.
- పాండు, ఎంపీడీవో పూడూరు.

పార్టీలకతీతంగా వార్డుల అభివృద్ధి

తాండూరు: అన్ని వార్డుల అభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేస్తానని పుర ఛైర్‌పర్సన్ స్వప్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీతారాంపేట సత్యసాయిబాబా దేవాలయం సమీపంలో మురుగు కాలువ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలో మురుగు కాలువల్లేకుండా ఇబ్బందులు పడుతున్న కాలనీల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు గ్రామీణ: జిన్‌గుర్తి శివారులోని గిరిజన ఆశ్రమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకటమ్మ తెలిపారు. పీజీటీ, జూనియర్ అధ్యాపకుడు(గణితం), జంతుశాస్త్రం, టీజీటీ ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, పీడీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోస్టులకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు శనివారం దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈనెల 21న రాజేంద్రనగర్‌లోని మానసహిల్స్‌లో నమూనా తరగతుల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.

చువ్వలు తేలినా.. పట్టించుకోరా..



పరిగి గ్రామీణ: పరిగి-షాద్‌నగర్ ప్రధాన రహదారిపై పరిగి మండల పరిధిలోని జాఫర్‌పల్లి గ్రామ పరిసరాల్లో ఉన్న కల్వర్టు ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాల రాకపోకల కారణంగా రోజు రోజుకూ సిమెంటు కొట్టుకుపోతూ మరింత ధ్వంసమవుతోంది. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతూ.. ఆసుపత్రుల పాలవుతున్నారు. అధికారులు మరమ్మతు చేయించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

సమయపాలన తప్పనిసరి

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విద్యార్థుల్లో అన్ని పాఠ్యాంశాలతో పాటు ఆంగ్ల పరిజ్ఞానాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఎంఈవో గోపాల్ సూచించారు. శుక్రవారం పరిగి మండల పరిధిలోని గడిసింగాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు రాసిన ఇంటి పనిని, ఆంగ్లంలో బోర్డుపై రాసిన పాఠ్యాంశాలను చదివించి వారి ప్రావీణ్యాన్ని పరిశీలించారు.

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

దుద్యాల, కొడంగల్ గ్రామీణం: కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పార్ట్‌టైం ఉద్యోగాలకు ఈనెల 19లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. పీజీటీ గణితం, పీజీటీ జీవశాస్త్రం, పీజీటీ సాంఘిక శాస్త్రం, టీజీటీ ఆంగ్లం, జేఎల్ ఆంగ్లం సబ్జెక్టులలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు గిరిజన గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని, వీరికి ఈనెల 21న రాజేందర్‌నగర్‌లోని మానస హిల్స్‌లో డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

ఆర్థిక సహాయం చెక్కు అందజేత



బాధితులకు అందిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తదితరులు

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: తుంకిమెట్లకు చెందిన బల్ల జయమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష ఆర్థిక సహాయం చెక్కును శుక్రవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అందజేశారు. జయమ్మ భర్త అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. మృతిచెందడంతో ఆయన భార్యకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఆర్థిక సహాయం మంజూరైంది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, మల్లేశ్, బాల్‌రాజ్‌గౌడ్, భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.

బాలికల్లో ఆత్మస్థైర్యం అవసరం



మాట్లాడుతున్న షీ టీం ఇన్‌ఛార్జి నర్సింలు

పరిగి, న్యూస్‌టుడే: విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం పెంపొందాలని సబ్ డివిజన్ షీ టీం ఇన్‌ఛార్జి నర్సింలు, మండల విద్యాధికారి గోపాల్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం- మిషన్ వాత్సల్య, మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకే ప్రభుత్వం షీ టీంలను ఏర్పాటు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ వెంకటేష్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ఆనందం

దోమ, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికతతో మానసిక ఆనందం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దోమ మండలం కిష్టాపూర్‌కు చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటనాగారెడ్డి నిర్వహించిన భూలక్ష్మి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశం, తెరాస దోమ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

దుద్యాల, న్యూస్‌టుడే: వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా అండ్ ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చెట్టుపల్లితండా కేజీబీవీ పాఠశాలలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.

మహిళలు పారిశ్రామికవేత్తగా ఎదగాలి

బషీరాబాద్: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్, ఏపీఎం పద్మారావు అన్నారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పొదుపు చేయడం, వివిధ వ్యాపారాలు కొనసాగించుకొని ఆర్థికంగా కుటుంబానికి అండగా ఉంటున్నారని అన్నారు.

ఇసుక ట్రాక్టరు జప్తు

తాండూరు: ఇసుకను అనుమతి లేకుండా రవాణా చేస్తున్న ట్రాక్టరును పోలీసులు జప్తు చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. పాత తాండూరుకు చెందిన కుద్దుల రమేష్ శుక్రవారం కాగ్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా రవాణా చేస్తున్నాడు. విషయం తెలిసిన పోలీసులు ట్రాక్టర్‌ను జప్తుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రోజూ వ్యాయామం తప్పనిసరి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ప్రతి రోజూ వ్యాయామం చేయడం తప్పనిసరి అని ఆర్‌ఎస్ఎస్ మండల బాధ్యుడు రవి అన్నారు. కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లిలో సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శాఖకు గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు హాజరయ్యారు.

బాధిత కుటుంబాలకు భారాస అండ: మాజీ ఎమ్మెల్యే

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ఇబ్బందుల్లో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు భారాస ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి అన్నారు. కుల్కచర్ల మండల పరిధిలోని చాపలగూడెంలో పార్టీ కార్యకర్త గండి చిన్నభీమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. చాపలగూడెంలోని ఆ కుటుంబాన్ని పార్టీ నాయకులతో కలసి పరామర్శించారు.

పరిగిలో పథసంచాలన్ 20న

పరిగి, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పరిగిలో ఈనెల 20న పథసంచాలన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మినీస్టేడియం ఆవరణలో మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేత

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 1996-98 బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం బొంరాస్‌పేట మండలంలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు పంపిణీ చేశారు. 50 మంది విద్యార్థులకు ఎంఈవో హరిలాల్ అందజేశారు. కార్యక్రమంలో చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం రవీందర్‌గౌడ్, హెచ్‌ఎం సాయిలయ్య, పూర్వ విద్యార్థులు వెంకటేశ్‌గౌడ్, మోయిస్‌ఖాన్, కృష్ణ, సతీష్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్తలు పాటించండి



ముజాహిద్‌పూర్‌లో అవగాహన

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుల్కచర్ల ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు. ముజాహిద్‌పూర్ గ్రామంలో గురువారం రాత్రి పోలీసు కళాజాత బృంద సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. చాలా మందికి సరైన అవగాహన లేకపోవడం ద్వారా సైబర్ మోసాల బారినపడుతున్నారన్నారు. వాహనాలు నడిపే సమయంలో శిరస్త్రాణం, సీటు బెల్టు తప్పని సరి అన్నారు. వాహనచోదకులు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఎస్సై రవిగౌడ్ సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో పెద్ద చెరువు కట్టపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

బషీరాబాద్: సైబర్ నేరాల విషయంలో యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బషీరాబాద్ ఎస్సై గఫార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు.

స్టడీ మెటీరియల్ అందజేత



కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్, తదితరులు

దుద్యాల, న్యూస్‌టుడే: జడ్పీహెచ్‌ఎస్ దుద్యాల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 10 మంది విద్యార్థులకు 'నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్' (ఎన్‌ఎంఎంఎస్)కు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. యూత్‌ఫర్ సేవా సంస్థ సహకారంతో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించారు.

మద్యం తాగి హంగామా చేసిన వ్యక్తి బైండోవర్

పెద్దేముల్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో గొడవ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి తహసీల్దార్ కిషన్ ఎదుట పోలీసులు శుక్రవారం బైండోవర్ చేశారు. నాగులపల్లి గ్రామానికి చెందిన మట్ట శ్రీనివాస్ మద్యం మత్తులో తమకు ఇబ్బంది కలిగించాడని పలువురు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి బైండోవర్ చేశారు. మరోసారి ఇలాంటి పనులు చేస్తే రూ.2 లక్షల వరకు జరిమానా విధించి జైలుకు పంపిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

మెట్లకుంటకు బస్సు పునరుద్ధరణ

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: మెట్లకుంట గ్రామానికి తాండూరు ఆర్టీసీ డిపో అధికారులు రాత్రిపూట బస్సు సర్వీసును శుక్రవారం పునరుద్ధరించారు. తాండూరులో రాత్రి 9 గంటలకు బయలుదేరి మెట్లకుంటకు 10 గంటలకు చేరుకుంటుంది. ఉదయం మళ్లీ 5.30 గంటలకు బయలుదేరి తాండూరుకు వెళ్తుంది.

క్షీరంలో చంద్రుడి దర్శనం

పాత తాండూరు: పౌర్ణమి సందర్భంగా పోట్లీ మహారాజ్ సంస్థాన్‌లో గురువారం అర్ధరాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి క్షీరంలో చంద్రుణ్ని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయంలో భావిగి భద్రేశ్వర, కాళీమాత, నగరేశ్వర, కందనెల్లి, అక్కంపల్లికి చెందిన భజనభక్త బృందాలు కీర్తనలు ఆలపించాయి.

పగపట్టిన.. పొగమంచు

- వరితో పాటు, వాణిజ్య పంటలకూ నష్టం



పూడూరు మండలం బార్లపల్లిలో నల్లగా మారుతున్న పత్తికాయలు

న్యూస్‌టుడే, పూడూరు: కొన్ని రోజులుగా మంచుతో పాటు వర్షాలు వెంటాడుతుండడంతో అన్నదాతకు గుబులు పుట్టిస్తోంది. వాతావరణం మబ్బులుగా ఉండటం, తుంపర్లు వస్తుండటంతో పూతలోకి చేరి వివిధ తెగుళ్లు సోకుతున్నాయి. క్రిమికీటకాలు నాశనం చేస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

ఈ ప్రాంతంలో అనుకూలమైన నేలలు ఉండటంతో రైతులు ఏటా ఖరీఫ్‌లో ప్రధాన వాణిజ్య పంటలుగా పత్తి, మొక్కజొన్న, కంది, పసుపు, ఎండుమిర్చి పంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ముందుగా సాగు చేసిన పత్తికి కాయలు విచ్చుకొనే సమయంలో వర్షం, మంచు మూలంగా తడిసి తయారైన పత్తి మొక్కల నుంచి నేలరాలుతోంది. మరి కొన్ని మొక్కలకు పూత, పిందెలు వస్తున్నాయి. పొలాల్లో నీటిశాతం ఎక్కువై మొక్కలు వాడి పోతున్నాయి. కాయలు నల్లబారుతూ మురుగుతూ నేలరాలుతున్నాయని రైతులు వాపోతున్నారు. పత్తి ఎకరానికి సాధారణంగా 8 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్లు రావాల్సి ఉంది. ఈ సారి భారీగా దిగుబడులు తగ్గేందుకు ఆస్కారం ఉంది. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, నియోజకవర్గాల పరిధిలోని ఆయా గ్రామాల్లో పత్తి పంట 2.50 లక్షల ఎకరాల వరకు సాగులో ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. యాసంగికి ముందే నాట్లు వేసే ఎండుమిర్చికి ఈ ప్రాంతంలో అనుకూలమైన నేలలు ఉన్నాయి. ప్రస్తుతం పూత కనిపిస్తుంది. అన్నదాతలు వివిధ క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. మంచు ప్రభావంతో పిందెలు రాకుండానే పూత రాలుతుందని అంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివారణకోసం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాల్సి ఉంది. వారు రాకపోవటంతో ఇష్టానుసారంగా నివారణ చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని పరిగి, పూడూరు, నవాబ్‌పేట, మోమిన్‌పేట, వికారాబాద్ మండలాల్లో ఎక్కువగా సాగవుతుంది.

వరిలో అగ్గితెగులు

ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంట ప్రస్తుతం చాలా గ్రామాల్లో ఆశాజనకంగా ఉంది. కంకులు రావటం, గింజలు గట్టిపడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కోతకు వస్తుంది. ఉదయం వేళల్లో విపరీతంగా వస్తున్న మంచు ప్రభావంతో కంకులపై చేరటంతో అగ్గితెగులు ప్రభావంతో మొక్కకు మొత్తం వ్యాపిస్తుంది. దీంతో ఎరుపుగా మారి కాలిపోయినట్లు అవుతుంది. సరియైన పోషకాలు అందక గింజలు తాలుగా మారేందుకు ఆస్కారం ఉందని రైతులు వాపోతున్నారు.

పంటలను పరిశీలిస్తున్నాం

తులసీరాం, ఏవో, పూడూరు

వాతావరణంలో వస్తున్న మార్పులతో వివిధ పంటలకు తెగులు సోకుతోంది. వెంటనే క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలిస్తున్నాం. ఆయా క్లస్టర్ల ఏఈవోల ద్వారా ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తెలియ పరుస్తున్నాం. పత్తి, కంది తదితర పంటలకు మందులు అధికంగా పిచికారీ చేయరాదు. వర్షాలు తగ్గుతున్న కొద్దీ పత్తి తీసేందుకు వస్తుంది.

తడిసిన తెల్ల బంగారం



పెద్దేముల్ మండలం బుద్ధారం పొలంలో పత్తి

న్యూస్‌టుడే, తాండూరు: నైరుతి రుతుపవనాలు నిష్క్రమించడంతో ఇక వానముప్పు తప్పి తెల్ల బంగారంగా పేరున్న పత్తి దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని రైతులు ఆశ పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించి ఆర్థికంగా బాగుపడవచ్చని ఊహించారు. అయితే దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో అల్ప పీడనం ఏర్పడింది. ఇది వాయుగుండంగా మారి జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ పరిణామం ఇప్పటికే పత్తి పొలాల్లో కాయలు పగిలి బయటికి వచ్చిన దూదిని పూర్తిగా తడిపేసింది. తేమ శాతం ఎక్కువవడంతో తెల్ల బంగారం కాస్త నల్లగా మారేందుకు అవకాశం ఏర్పడింది. ఈ పరిణామం దిగుబడులు, మద్దతు ధరపై తీవ్ర ప్రభావం చూపనుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వానాకాలంలో 1,34,640 మంది రైతులు 2,56,698 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున దిగుబడులు వచ్చే స్థానే మారిన పరిస్థితుల కారణంగా చాలా తక్కువ దిగుబడులే వచ్చే అవకాశం ఉంది.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

సదాశివపేట, న్యూస్‌టుడే : గంజాయి రవాణా కేసులో గతంలో అరెస్టయి తప్పించుకు తిరుగుతున్న ఒరిస్సాకు చెందిన నిందితుడు చంద్రురావును పోలీసులు తిరిగి అరెస్టు చేశారు. శుక్రవారం రిమాండుకు పంపినట్లు సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయండి

బొంరాస్‌పేట: డీఎస్సీ 2024 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులతో పాటు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, నరేందర్‌గౌడ్ ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. వడిచెర్ల, ఎన్కెపల్లి, బురాన్‌పూర్, కొత్తూరు తదితర చోట్ల సర్దుబాటు చేయాలన్నారు.